సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



అండగా 'మత్స్య కిసాన్'
ఆక్వా రంగంలో రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. 8లో ▸



కార్మికులకు కన్నీళ్లే
కార్మికుల కోసం పలు చట్టాలు ఉన్నా వాటి ప్రయోజనం మాత్రం లబ్ధిదారులకు అందడం లేదు. పథకాలు దరి చేరడం లేదు. 8లో ▸



శివరాత్రి ఏర్పాట్లు
భీమవరం గునుపూడిలోని పంచారామ క్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

పంచారామాల్లో పటిష్ట ఏర్పాట్లు



పాలకొల్లులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఉప కమిషనర్ రమేష్‌బాబు

పోడూరు: పంచారామ క్షేత్రాల వద్ద మహాశివరాత్రి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ ఉప కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు ఆదేశించారు. పాలకొల్లులోని క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా దేవదాయశాఖ అధికారి ఈవీ సుబ్బారావు, ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

భీమవరంలో..
భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానం, భీమేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాట్లను ఉప కమిషనర్ రమేష్‌బాబు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈవీ సుబ్బారావు, డీవీ వెంకటేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, రోగుల బాగోగులు ఎప్పటికప్పుడు చూసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వైద్యారోగ్య శాఖ, సివిల్ సప్లయిస్, అన్న క్యాంటీన్లు, ఈ–శ్రమ పోర్టల్, గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల ఏర్పాటు, ఆధార్ నమోదుపై ఆమె గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ బి.బాలూనాయక్, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శైవక్షేత్రంలో ఈనెల 25, 26, 27వ తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు శ్రీ బాలాత్రిపుర సుందరీ పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. శనివారం పీఠం ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 25న ఉదయం 9.23 గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు మేధా సరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన, ధ్వజారోహణ, రాత్రి భూప్రస్తార శ్రీచక్రార్చన జరుగుతుందన్నారు. 26న స్ఫటిక లింగేశ్వరస్వామి వారికి మానస సరోవర జలంతో అభిషేకం, మహాదేవునికి మహాకుంభాభిషేకం, రాత్రికి శివపార్వతుల కల్యాణం, లక్ష జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 27న విశ్వేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, సంపూర్ణ పూర్ణాహుతి, సాయంత్రం శివ పార్వతులకు శాంతి కల్యాణం, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ముగిసిన టీసీసీ పరీక్షలు

భీమవరం: జిల్లాలో జరుగుతున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు ముగిసినట్టు డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. స్థానిక ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్‌లో శనివారం ఉదయం డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 70 మందికి 51 మంది, హయ్యర్ పరీక్షకు 29 మందికి 24 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 70 మందికి 51 మంది, హయ్యర్ పరీక్షకు 29 మందికి 24 మంది హాజరయ్యారు.

బాలల చట్టాలు పక్కాగా అమలుచేయాలి

ఏలూరు (టూటౌన్): బాలల సంక్షేమం కోసం ఉన్న చట్టాలను అధికారులు పక్కాగా అమలు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం.సునీల్‌కుమార్ సూచించారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జ్యువనైల్ పోలీస్ యూనిట్‌కు జ్యువనైల్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల సంక్షేమ చట్టాలపై అధికారులు ఎప్పటికప్పుడు తర్ఫీదు పొంది చిన్నారుల సంక్షేమానికి కృషిచేయాలన్నారు. చట్టంతో విభేదించిన బాలలతో ప్రవర్తించాల్సిన విధి విధానాలు, వారికి కల్పించాల్సిన పునరావాస సౌకర్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాల నిరోధానికి కృషిచేయాలని ఆయన అన్నారు.

కూటమి నేతలకే పల్లె పండుగ

పంచుకో.. దోచుకో..
- పల్లె పండుగలో జిల్లాకు రూ.46.48 కోట్లతో 360 రోడ్ల మంజూరు
- నేతలు సిఫార్సు చేసిన చోటే పనులు
- రూ.20 కోట్లతో 299 పనులు పూర్తి
- కొన్నిచోట్ల చేపల చెరువులు, ఖాళీ స్థలాలకు రహదారులు
- గత టీడీపీ హయాంలో చేసిన పనులకూ ఇప్పుడు బిల్లులు చేసుకునే ప్రయత్నాలు

పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామ శివార్ల నుంచి పంట పొలాలు, ఆక్వా చెరువులకు వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.30 లక్షలతో 482 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు. పంట, ఆక్వా ఉత్పత్తులు తరలించుకునేందుకు ఈ రోడ్డును వినియోగిస్తుంటారు. గ్రామంలోని జనావాసాల్లో పలుచోట్ల రహదారుల సదుపాయం సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అక్కడ కాదని పొలాలు, చెరువులకు వెళ్లే కంకర రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడం గమనార్హం.



పెంటపాడు మండలం ఉమామహేశ్వరం శివార్లలో పొలాల్లోకి వేసిన సీసీ రోడ్డు

భీమవరం రూరల్ మండలం దొంగపిండి గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి ప్రాంతంలో దాదాపు పది కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. మట్టిరోడ్డుతో వర్షం వస్తే రాకపోకలకు ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామంలోని మరోచోట ఖాళీ స్థలాల మీదుగా కొన్ని కుటుంబాలు వారు నివసిస్తున్న ప్రాంతానికి రూ.11.75 లక్షల వ్యయంతో 137 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేశారు.



భీమవరం రూరల్ దొంగపిండిలో ఖాళీ స్థలాల మీదుగా వేసిన సీసీ రోడ్డు

సాక్షి, భీమవరం: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి గత అక్టోబరులో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 350 పంచాయతీల పరిధిలో రూ.46.48 కోట్ల వ్యయంతో 66.6 కి.మీ రోడ్ల అభివృద్ధికి 360 పనులు మంజూరు చేసింది. వీటిలో 53.55 కి.మీ మేర రూ.42.42 కోట్ల విలువైన 349 సీసీ రోడ్లు, 11.67 కి.మీ మేర రూ.3.71 కోట్ల విలువైన తొమ్మిది బీటీ రోడ్లు, 1.3 కి.మీ మేర రూ.35 లక్షల విలువైన రెండు డబ్ల్యూబీఎం రోడ్లు ఉన్నాయి. కూటమి నాయకులు సూచించిన వారికే ఆయా పనులను కట్టబెట్టారు. కొన్నిచోట్ల కూటమి నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు చేస్తుండగా, మరికొన్ని చోట్ల తమకు పర్సంటేజీలు ఇచ్చేలా కాంట్రాక్టర్లకు పనులను అప్పగించినట్టు తెలుస్తోంది.

నాణ్యతపై అనుమానాలు
పల్లె పండుగ రోడ్ల నిర్మాణ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ఇప్పటివరకు సుమారు రూ.20 కోట్ల విలువైన 45.8 కి.మీ మేర 295 సీసీ రోడ్ల పనులు చేయగా, 2.8 కి.మీ మేర రూ.95 లక్షల విలువైన రెండు బీటీ రోడ్లు, 1.4 కి.మీ మేర రూ.24 లక్షల విలువైన రెండు డబ్ల్యూబీఎం రోడ్డు పనులు జరిగాయి. పలుచోట్ల పనుల్లో నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ రోడ్లు నిర్మించినా బెర్ములు వేయకపోవడంతో రోడ్ల అంచులు ప్రమాదభరితంగా ఉంటున్నాయని స్థానికులు అంటున్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు
ప్రజావసరాల మేరకు రోడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. కాలనీలు, గ్రామ శివార్లలోని జనావాసాల్లో రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లె పండుగలో చేపట్టాల్సిన పనులు గుర్తించేందుకు పేరుకు గ్రామ సభలు నిర్వహించినా కూటమి నాయకులు పెట్టిన పనులనే అధికారులు ఆమోదించారు. ఎక్కువ మంది జనం నివసిస్తున్న ప్రాంతాలు, ముంపు బారిన పడే కాలనీల్లో కాదని తమకు కావాల్సిన చోట పనులు ప్రతిపాదించారని, తమ భూముల విలువలు పెంచుకునేలా ఖాళీ స్థలాలు, పొలాలు, చెరువులకు రోడ్లు వేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల పాత సీసీ రోడ్లపై మరలా కొత్తగా సీసీ రోడ్లు వేస్తుండటంతో పూర్వపు ఇళ్లు పల్లమైపోయి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గత టీడీపీ హయాంలో చేసిన రోడ్లకు కొత్తగా మెరుగులు దిద్ది బిల్లులు చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా పనులు పూర్తయిన మేరకు ఇప్పటివరకు రూ.1.75 కోట్ల బిల్లులు చెల్లింపులు చేయగా మరో రూ.11.5 కోట్ల మేర బిల్లులు చెల్లించేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా అక్రమాలకు తావులేకుండా నిబంధనల మేరకే పనులు చేస్తున్నట్టు డ్వామా అధికారులు చెబుతున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి



భీమవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులు బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులకు ఓట్లు వేసి ఘన విజయం అందించాలని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. శనివారం పట్టణంలో పలు విద్యా సంస్థల్లో ఉద్యోగులు, నిరుద్యోగులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 17 ఏళ్లుగా పీడీఎఫ్‌కు చెందిన 16 మంది ఎమ్మెల్సీలు శాసనమండలిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, స్కీం వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వాలను నిలదీశారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ అభ్యర్థిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబెట్టి రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని పాలకులు సంక్షోభంలోకి నెట్టివేశారని, దీంతో మరింత అంధకారంలోకి వెళ్లే దుస్థితి నెలకొందన్నారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు విజయరామరాజు, అబ్రహం, నాగబాబు, రామకృష్ణంరాజు, మల్లేశ్వరరావు, సీఐటీయూ నాయకులు బి.వాసుదేవరావు, క్రాంతిబాబు, రాము పాల్గొన్నారు.

గ్రూప్‌-2 రోస్టర్ విధానంలో తప్పులు



ఏలూరులో జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గ్రూప్‌–2 ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ప్రకటించిన రోస్టర్ విధానంలో నెలకొన్న తప్పులను వెంటనే సవరించాలని గ్రూప్‌–2 మెయిన్స్ పరీక్షలు రాసే అభ్యర్థులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. పి.రఘురామ్ అనే అభ్యర్థి మాట్లాడుతూ రోస్టర్ విధానంలో తప్పుల కారణంగా గందరగోళం నెలకొన్నా ఏపీపీఎస్సీ అధికారుల్లో చలనం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సాగులో డ్రోన్ల వినియోగం లాభదాయకం

కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్: వరి సాగులో డ్రోన్లను వినియోగించి మందులు పిచికారీ చేయడం లాభదాయకమని, కూలీల ఖర్చు తగ్గుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం మండలంలోని తుందుర్రులో వరి పంటలో అగ్గితెగులు నివారణకు డ్రోన్ ద్వారా మందు వెదజల్లే పద్ధతిని ఆమె పరిశీలించారు. డ్రోన్ వాడకంపై ఆపరేటర్ మల్లుల శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్‌లో సివిల్ ఇంజనీర్ చదివానని, వ్యవసాయం మీద మక్కువతో 2023లో రూ.4 లక్షలతో డ్రోన్‌ను స్వయంగా తయారు చేసి వినియోగిస్తున్నట్టు ఆపరేటర్ శ్రీనివాస్ కలెక్టర్‌కు తెలిపారు. డ్రోన్ వినియోగంపై యువతకు శిక్షణకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. జిల్లాలో 1.15 లక్షల మంది వివరాలు నమోదు చేయాల్సి ఉండగా 75 వేల మంది వివరాలను నమోదు చేసి గుర్తింపు సంఖ్యను అందించినట్టు వ్యవసాయ విస్తరణ అధికారి బి.దేవి స్వరూప వివరించారు.



డ్రోన్ వినియోగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రీసర్వే పనుల పరిశీలన
పైలెట్ ప్రాజెక్టులో భాగంగా తుందుర్రులో జరుగుతున్న రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభలో పాల్గొన్నారు. రీ సర్వే పనులకు రైతులు సహకరించాలని కోరారు. గ్రామంలో లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలపై తహసీల్దార్ రావి రాంబాబును అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ 39 మంది లబ్ధిదారులకు కేటాయించిన లే అవుట్ పల్లంలో ఉందని, గృహ నిర్మాణాలకు అనువుగా లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఈ–శ్రమ్ పోర్టల్ నమోదు, వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఈ.నాగార్జున, ఎంపీడీఓ ఎస్ మురళీ గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ



ఏలూరులో శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లాకు సంబంధించి విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓలకు రెండో విడత శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విధులు, ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులను ప్రశ్నలు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారన్నారు. బ్యాలెట్ పేపర్‌ను మడతపెట్టి బాక్సులో వేయడంపై అవగాహన కల్పించారు. పీఓ, ఏపీఓలు ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా చదివి అవగాహనతో పకడ్బందీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. మాస్టర్ ట్రెయినీలు శ్రీనివాస్, ఫణి ఓటు వేసే విధానం, పోలింగ్ సిబ్బంది నియామకం, పోలింగ్ మెటీరియల్స్, ముఖ్యమైన ఎన్నికల సామగ్రి తనిఖీ, పోలింగ్ కేంద్రానికి చేరిన వెంటనే చేయాల్సిన విధులు, పోలింగ్ రోజు విధులు తదతరాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల అధికారులకు బ్యాలెట్ బాక్సు ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడంపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి తదితరులు ఉన్నారు.

భార్యాబాధితుల సంఘం.. ఓ వర్గానికి ఊరట కోసం

- పెరుగుతున్న బాధితులు
- మగాళ్లకూ రక్షణ కావాల్సిందే..
- జాతీయస్థాయిలో ఉద్యమం
- తెలుగు రాష్ట్రాల్లో శాఖల ఏర్పాటు
- గూడెంలో ఆవిర్భవించిన సంఘం



తాడేపల్లిగూడెం: భార్యాభర్తలు.. అన్యోన్య దాంపత్యానికి ప్రతిరూపాలు.. ఒకరికి ఒకరై.. కష్టసుఖాల్లో తోడుంటూ.. జీవితాన్ని ఆనందమయం చేసుకోవాల్సిన దంపతులు ఆహం, అహంకారం, అవగాహన లేమితో నిండు జీవితాల్లో నిప్పులు పోసుకుంటున్నారు. చట్టాల్లో వెసులుబాటును ఆసరాగా తీసుకుని కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరకట్న వేధింపుల నివారణ, గృహహింస చట్టాలు కొందరు మహిళలకు ఆయుధంగా మారాయి. ఇలా భార్యల వల్ల ఇబ్బందులు పడుతున్న కొందరు ఏర్పాటుచేసుకున్న సంఘమే భార్యాబాధితుల సంఘం. 2010లో తాడేపల్లిగూడెంలో పురుడు పోసుకున్న సంఘం దేశవ్యాప్తంగా శాఖలుగా విస్తరించింది. తాడేపల్లిగూడెం, నందిగామ, హైదరాబాద్, ఖమ్మంలో ముఖ్య శాఖలుగా చైతన్య వంతమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ భార్యాబాధితులకు బాసటగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన ఈ సంఘంలో సుమారు 10 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. 25 మంది క్రియాశీలకంగా కోర్ కమిటీగా ఏర్పడి సంఘం తరపున న్యాయం కోసం గళం విప్పుతున్నారు.



భార్యాబాధితుల సంఘం క్యాలెండర్

ఫిర్యాదుల స్వీకరణే.. కేసులు నమోదు కాలేదు
భార్యాబాధితుల సంఘం తరపున బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా తమ గోడు వెళ్లబోసుకుంటూ ప్రజాప్రతినిధులకు, పోలీసులకు పలు ఫిర్యాదు అందించారు. అయితే ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం 498 (ఎ) సెక్షన్‌లో కల్పించిన స్టేషన్ బెయిల్ వెసులుబాటు మాత్రమే భార్యాబాధితుల సంఘానికి కాసింత ఊరట.

దేశవ్యాప్తంగా కార్యకలాపాలు



నా భార్య నా మీద అసత్య ఆరోపణలతో కేసులు వేసి హింసించింది. విడాకులయ్యాయి. ఈ నేపథ్యంలో 2010లో 35 మంది సభ్యులతో సంఘం స్థాపించా. అమెరికా, మలేషియా, దుబాయ్‌ల నుంచి కూడా భార్యాబాధితులు ఫోన్‌లో సంప్రదిస్తున్నారు. మా సంఘం దేశవ్యాప్తంగా కార్యకలాపాలు చేస్తుంది. మాకు 13 డిమాండ్లు ఉన్నాయి. భార్యాబాధితుల రక్షణ కోసం చట్టాలు రావాల్సిందే. గౌరవం కోల్పోతున్నాం, మనశ్శాంతి ఉండటం లేదు. వ్యసనాలకు బానిసలవుతున్నాం. ఎందరో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తప్పు లేకుండా పరిహారాలు కోరవద్దు. మా ఆస్తులకు మమ్మల్ని దూరం చేస్తున్నారు. భార్యలతో ఇబ్బంది పడే భర్తల తరపున పోరాటం కొనసాగుతుంది.

– జి.బాలాజీ రెడ్డి, భార్యాబాధితుల సంఘం జాతీయ అధ్యక్షుడు

మార్గదర్శకాలకు లోబడే చర్యలు

భార్యాబాధితుల సంఘం తమ బాధలను వ్యక్తం చేసుకుని ఉనికిని తెలియజేసే ఒక సంఘం మాత్రమే. కుటుంబాల మధ్య వచ్చిన విభేదాలు చట్టం పరిధిలోనే పరిష్కారం కావాలి. సంఘాల తరపున పోరాటం చేసినంత మాత్రాన కేసులు నమోదు చేసే అవకాశం లేదు. వారి ఆవేదనను వ్యక్తం చేసుకునే వేదికగా మాత్రమే భార్యాబాధితుల సంఘం పోరాటం చేస్తోంది. సంఘం ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని కేసులు, నిర్ణయాలు వెలువడే అవకాశం లేదు. న్యాయస్థానాల మార్గదర్శకాలకు లోబడి మాత్రమే చర్యలు ఉంటాయి.

– దశిక మురళీకృష్ణ, హైకోర్టు సీనియర్ న్యాయవాది

భార్యాబాధితుల సంఘం డిమాండ్లు

- 498 (ఎ) గృహ హింస కేసు పెట్టిన ఏడాది తర్వాత కేసు తేలినా, తేలకపోయినా కోర్టు విడాకులు మంజూరు చేసి, రెండో వివాహానికి అనుమతి ఇవ్వాలి.
- 498 (ఎ) గృహ హింస తప్పుడు కేసు అని తేలితే భార్య, భార్య తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు శిక్ష, భర్తలకు నష్టపరిహారం, పరువు మర్యాదలు ఇప్పించాలి.
- భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు భర్తలు, భర్తల కుటుంబాలందరికీ కూడా కౌన్సెలింగ్‌లు ఇచ్చి సరైన న్యాయం జరిగేలా చూడాలి.
- భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు హాజరు కావాలి. అలా రెండు సార్లు హాజరు కాని పక్షంలో ఆ కేసులను పూర్తిగా రద్దు చేయాలి
- ఎంసీ, డీవీసీ (డొమెస్టిక్ వయొలెన్స్)లను చట్టం నుంచి పూర్తిగా రద్దు చేసి పెండింగ్‌లో ఉన్న కేసులను రద్దు చేసి, జైలు శిక్షలు అనుభవిస్తున్న వారిని వెంటనే విడుదల చేయాలి
- పూర్వం ఈ కేసుల వల్ల నష్టపోయిన వారికి భార్యలతో ఆ నష్టపరిహారాన్ని ఇప్పించి ఒక ఏడాది భార్యలకు, భార్యల తల్లిదండ్రులకు జైలు శిక్ష మంజూరు చేయాలి.
- భర్తలు అవసరం లేదని వెళ్లిన భార్యలకు నష్ట పరిహారం చెల్లించకూడదు.
- గృహ హింస కేసు పెట్టిన తర్వాత భార్యాభర్తలిద్దరి శాంపిల్స్ డీఎన్ఏ టెస్ట్‌లకు పంపాలి.
- భార్యలు కేసులు పెట్టిన తర్వాత ఒక వేళ పిల్లలు ఉంటే భార్యల వద్ద నాలుగు రోజులు, భర్తల వద్ద మూడు రోజులు ఉండేటట్లు అనుమతినివ్వాలి.
- భార్యలు పెట్టిన కేసుల వల్ల భర్తలకు ఉద్యోగాలు పోకుండా చూడాలి. భర్తలు, వారి తల్లిదండ్రులు కష్టపడి సంపాదించుకున్న ఆస్తిపాస్తులు భార్యా పిల్లలకు చెందకూడదు.
- పెళ్లి అయిన ఏడాది తర్వాత నుంచి భార్యలు పుట్టింటికి చూడటానికి వెళితే నెల రోజులలోపు భర్తల దగ్గరకు రావాలి. అలా రాని యెడల భర్తలకు విడాకులు మంజూరు చేయాలి.
- భర్తల దగ్గర నుంచి భార్యలు విడాకులు తీసుకున్న తర్వాత భార్యలు, పిల్లలు భర్తల ఇంటి పేర్లను ఎటువంటి వాటిలో ఉపయోగించకూడదు. అలా ఉపయోగించిన పక్షంలో కోర్టు శిక్ష విధించాలి.
- మహిళలకు ఎటువంటి చట్టాలు, పథకాలు ఇచ్చారో అలాంటి చట్టాలు, పథకాలు పురుషులకు కూడా ఇవ్వాలి.

క్లుప్తంగా

ఫుట్‌బాల్‌లో భారత్ విజయంపై హర్షం



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: దుబాయిలో జరుగుతున్న పింక్ లేడీస్ కప్ పోటీల్లో జోర్డాన్‌పై భారత్ 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించడంపై ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో రష్యా, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్, థాయిలాండ్, జోర్డాన్ దేశాల బాలికల జట్లు పాల్గొన్నాయని ఆయన తెలిపారు. తొలి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడం వెనుక నైపుణ్యత కలిగిన శిక్షణ, జట్టులోని బాలికల నిరంతర సాధన, పట్టుదల, క్రమశిక్షణ ఉన్నాయని పేర్కొన్నారు. జట్టు హెడ్ కోచ్‌తో పాటు భారత జట్టు బాలికలకు ఆయన అభినందనలు తెలిపారు.

హ్యాండ్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

దెందులూరు: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాలికల జట్టును(జేఎన్‌టీయూ, కాకినాడ) సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందని వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధి తెలిపారు. శనివారం కళాశాలలో జట్టు వివరాలను ప్రకటించారు. తమిళనాడు రాష్ట్రం సేలం యూనివర్సిటీలో మార్చి 3 నుంచి 7 వరకు జరిగే వాలీబాల్ పోటీల్లో ఆడతారన్నారు.

జట్టు వివరాలు

కే సంధ్య, జీ ప్రవళిక సత్య, జీ లావణ్య అనుసాయి, కే దుర్గ, బీ వెంకట కావ్య, సీహెచ్ రాణి ప్రవళిక, వీ శాంభవి, ఆర్.వెంకట స్వప్న, పీ కల్పన, ఆర్.సౌజన్య, కే సుజాత, పీ లక్ష్మి ప్రసన్న, బీరమ్య, పీ రమ్యశ్రీ, బీ సుచిత్రను ఎంపిక చేశామన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఉండి: పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన కొలుకులూరి సతీష్ ఉండి మండలం కలసిపూడిలో బంధువుల ఇంటి బయట ఈ నెల 19 బైక్ పెట్టాడు. కిటికీలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టాడు. ఉదయం చూడగానే ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ మాయమయ్యాయి. మేనమామ సాయం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆక్వాకు అండగా మత్స్య కిసాన్

భీమవరం: ఆక్వా రంగంలో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన పథకంలో బీమా పథకం ప్రవేశపెట్టింది. ఈ బీమా పథకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

బీమా పథకం విధి విధానాలు..

ఆక్వా పంట సాగు 180 రోజుల ప్రీమియం ధర తొలి 60 రోజులకు వర్తిస్తుంది. తరువాత ప్రతి 30 రోజులకు నిర్ణీత ప్రీమియం చెల్లించాలి. బీమా ఒక పంట కాలానికి మాత్రమే వర్తిస్తుంది. చెరువుల్లో రొయ్య పిల్లలు వేసిన తరవాత ఎక్కువ సంఖ్యలో రొయ్యలుంటే సాధరణంగా రైతులు మధ్యలో పట్టుబడి చేస్తుంటారు. అలా ఏ కారణంచేతనైనా మధ్యలో పట్టుబడి చేస్తే బీమా కాల పరిమితి ముగిసినట్లే. పంట మొత్తం పాడైతేనే బీమా వర్తిస్తుంది. బీమా వర్తించిన పంటకు బీమా సొమ్ములో 80 శాతం తిరిగి రైతుకు చెల్లిస్తారు. బీమా చెల్లించిన రైతులు తమ చెరువుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి. రొయ్యలు పాడైపోతే సమూనాలు ల్యాబ్‌లో పరీక్ష చేయించి 24 గంటల్లో బీమా కంపెనీకి రిపోర్టు ఇవ్వాలి. కంపెనీ ప్రతినిధులు సరుకును పరిశీలించి నిర్ధారించిన తరవాత పట్టుబడి చేయాలి. రావడం ఆలస్యమైతే రొయ్యల పట్టుబడిని సీసీ కెమెరాలు లేదా జియోట్యాగింగ్, పట్టిన తేదీ, సమయం కలిపి సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి బీమా కంపెనీ ప్రతినిధులకు అందించాలి.

రెండు రకాల బీమా

బేసిక్ కవరేజ్ స్కీంలో ప్రీమియం లక్షకు రూ.3,100 చెల్లించాలి.. దీనికి జీఎస్టీ అదనం. బీమా చెల్లించినా వరదలు, భారీ వర్షా కారణంగా చెరువులు ముంపునకు గురికావడం, కాలుష్య కారణాల వల్ల సరుకు పాడైనప్పుడు, చెరువులో విష ప్రయోగం జరిగి రొయ్యలు మత్యువాత పడినప్పుడు, తెగుళ్ల కారణంగా పాడైన చెరువులకు బీమా వర్తించదు. కాంప్రహెన్సివ్ కవరేజ్: ప్రీమియం రూ. 6 వేలు చెల్లిస్తే బేసిక్ కవరేజీలో ఉన్న వాటితోపాటు వ్యాధుల వల్ల సరుకు పాడైన చెరువులకు బీమా వర్తిస్తుంది.



భీమవరం ప్రాంతంలో రొయ్యల చెరువులు(ఫైల్)

రైతులకు ప్రయోజనం



ప్రధానమంత్రి మత్స్య కిసాన్ ఆక్వా సమృద్ధి సహ యోజన పథకంలో తెచ్చిన బీమా పథకం రైతులకు ఎంతో ప్రయోజకరం. రెండు విధానాల్లో బీమా చెల్లించే అవకాశమున్నందున రైతులు తమకు ఇష్టమైన పథకాన్ని ఎంచుకోవచ్చు. ఆక్వా బీమా పథకంపై జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్‌వీ ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, భీమవరం

హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లకే ప్రయోజనం



ఆక్వా రంగానికి గతంలో కూడా బీమా అవకాశం కల్పించారు. ఈ పథకం రైతుల కంటే హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ఎంపెడా ఆధ్వర్యంలో రైతులకు ఎక్కువ ప్రయోజనం కల్పించేలా కృషిచేయాలి. దీనిపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి.

– గాదిరాజు సుబ్బరాజు, ఆక్వా రైతుల సంఘం కార్యదర్శి

కార్మికులకు కన్నీళ్లే

- కంటి తుడుపుగా ఈ–శ్రమ పోర్టల్
- అమలు కాని కార్మిక సంక్షేమ పథకాలు



అసంఘటిత రంగ కార్మికులు(ఫైల్)

ఆకివీడు : కార్మికుల కోసం అనేక చట్టాలు అమలులో ఉన్నా వాటి ప్రయోజనం మాత్రం లబ్ధిదారులకు అందడం లేదు. జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల వివరాల్ని ఈ–శ్రమ యాప్‌లో నమోదు చేయిస్తున్నారు. ఈ పోర్టల్‌లో నమోదు చేయడం వల్ల కార్మికులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. అయితే ఇంతవరకూ అమల్లో ఉన్న ఏ పథకం వల్ల తమకు ప్రయోజనం అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల కోసం యాజమాన్యం రూపాయి కార్మిక ఫండ్‌గా చెల్లిస్తోంది. కార్మిక సంక్షేమం కోసం ఈ సొమ్మును వినియోగించాల్సి ఉండగా, ఈ నిధి తమకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదని కార్మికులు అంటున్నారు. కనీస వేతన చట్టం కనుమరుగైపోయింది. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకనుగుణంగా కార్మికులకు వేతనాలు చెల్లించాలనే డిమాండ్ అమలు చేయడం లేదు. కార్మికులకు రూ.3 వేలు ప్రావిడెంట్ ఫండ్ ఇస్తామని బీజేపీ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని మర్చిపోయింది. 2024 ఎన్నికల్లో రూ.5 వేలు చేస్తామన్న చెప్పినా.. ఇంతవరకూ అమలు దిశగా ఎలాంటి చర్యలు లేవంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికుల వివరాలు	అసంఘటిత	భవన నిర్మాణ	సంఘటిత
ఏలూరు	5,35,391	3,63,063	1,35,723
పశ్చిమ గోదావరి	6,50,200	4,50,200	45,000

రూ.10 లక్షల చంద్రన్న బీమా ఏమైంది?

గత ఎన్నికల్లో చంద్రన్న బీమా సౌకర్యాన్ని రూ.10 లక్షలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు ఏమైందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో రూ.5 లక్షలు వైఎస్సార్ బీమాగా చెల్లించేవారు. ప్రమాద బీమాను ఎన్నికల నినాదంగా వాడుకున్న కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలలైనా బీమా ఊసే ఎత్తడంలేదని కార్మికులు వాపోతున్నారు. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈఎస్‌ఐ ఆసుపత్రులు దిష్టిబొమ్మల్లా ఉన్నాయని పలువురు కార్మికులు, కార్మిక సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. ఈఎస్‌ఐ డిస్పెన్సరీల్లో కనీస మందులు ఉండడం లేదు. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెంలలోని డిస్పెన్సరీల్లో పర్మినెంట్ వైద్యులు అందుబాటులో లేరు.

కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని హరించివేస్తున్నారని సీఐటీయూ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ తప్పుపట్టారు. ఉద్యమాలతో పుట్టిన చట్టాల్ని రక్షించుకునేందుకు కార్మికులు సంఘటితం కావాలన్నారు. కార్మిక చట్టాల్ని పునరుద్ధరించి, దేశ ప్రగతికి ప్రభుత్వాలు నడుం బిగించాలని, సంక్షేమ నిధి, ఈఎస్‌ఐలను అభివృద్ధి చేయాలని సీఐటీయు ఆకివీడు మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు అన్నారు.

పంచారామక్షేత్రంలో శివరాత్రి ఏర్పాట్లు

26న స్వామి వారి కళ్యాణం, 27న రథోత్సవం

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం పంచారామ క్షేత్రం శ్రీఉమాసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానంలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4 వరకు శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మురంగా సాగుతున్నాయి. క్యూలైన్ల ఏర్పాటు, పందిళ్ల ఏర్పాటు పూర్తి చేశారు. శివరాత్రి ఉత్సవాలను తిలకించడానికి, ఉమాసోమేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం శివరాత్రి ఉత్సవాలపై ఆర్డీఓ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు

ఐదు రోజుల పాటు ఉమాసోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో కొలువైన పార్వతీదేవి, అన్నపూర్ణదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 26న తెల్లవారుజామున 4.42 గంటలకు స్వామికి కళ్యాణం, 24న స్వామికి రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చనలు, 25న స్వామికి రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చనలు, 26న మహాశివరాత్రి నాడు ప్రత్యేక పూజలు, 27న రథోత్సవం, 28న తెప్పోత్సవం, 28న తిరుగు రథోత్సవం నిర్వహిస్తారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో..

మరో శైవ క్షేత్రమైన భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి 28 వరకూ మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించున్నారు. 26న స్వామి కల్యాణం, 27న రథోత్సవం, 28న తెప్పోత్సవం నిర్వహించనున్నారు.



విద్యుత్ కాంతుల్లోపంచారామక్షేత్రం



ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



బలివే ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

బలివే(ముసునూరు): బలివే ఉత్సవాల్లో భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉత్సవాల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, తహసీల్దార్ కె.రాజీకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఎక్కువ భక్తులు హాజరయ్యేలా ఉత్సవాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేవదాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో భక్తుల పుణ్య స్నానాలు, పిండ ప్రదానాలు, అభిషేకాలు, దైవ దర్శనానికి, ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రసాదాల కౌంటర్లు, స్నాన ఘట్టాలు, మంచినీరు, మజ్జిగ అందించే చోట్ల రద్దీ నివారణకు క్యూ లైన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సుమారు 400 మంది పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో, నిత్యం సీసీ కెమెరాల నిఘాతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు స్నానఘట్టాల వద్ద జల్లు స్నానాలు, పిండ ప్రదానాల ప్రదేశాలను పరిశీలించి, ఏక కాలంలో 120 మంది భక్తులు జల్లు స్నానాలు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతరం ఎస్పీతో కలసి ఆలయ ప్రాంగణం లోపల, వెలుపల, ప్రసాదాల కౌంటర్ల వద్ద, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లను, పందిళ్లను పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, డీఎల్పీఓ సుందరి, ఎంపీడీఓ జి.రాణి తదితరులు పాల్గొన్నారు.



బలివేలో క్యూలైన్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, జిల్లా ఎస్పీ

24 గంటల్లోనే బంగారం రికవరీ

పెనుగొండ: పెనుగొండలో బంగారు అభరణాల చోరీని పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. సుమారు రూ.25 లక్షల విలువైన 49 కాసుల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి శనివారం ఆచంట పోలీస్‌స్టేషన్ వద్ద వివరాలు వెల్లడించారు. పెనుగొండ ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉంటున్న గుబ్బల లక్ష్మీనారాయణ ఈ నెల 17న షిర్డీ యాత్రకు వెళ్లారు. శుక్రవారం వచ్చే సరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నర్సాపురం డీఎస్పీ జీ వేద ఆధ్వర్యంలో పెనుగొండ సీఐ రాయుడు విజయ్‌కుమార్, పెనుగొండ, పెనుమంత్ర, ఆచంట ఎస్సైలు గంగాధరరావు, స్వామి, కేవీ రమణలు దర్యాప్తు ప్రారంభించారు. చిన్నంవారి పాలెం శివారుకు చెందిన కోన పోతురాజు, అమలాపురానికి చెందిన బండారు గణేష్‌లు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. పెనుగొండ నక్కల కాలువ సమీపంలో పోతురాజును అరెస్ట్ చేసి, ఇంట్లో తనిఖీ చేయగా 49 కాసుల బంగారు అభరణాలను గుర్తించి, మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. బండారు గణేష్ పరారీలో ఉన్నాడు. 24 గంటల్లోనే చోరీ కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. వీరికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు.



దొంగల నుంచి రికవరీ చేసిన బంగారం

బైక్ దొంగ అరెస్టు

పెనుగొండ: మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 10 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ తెలిపారు. శనివారం ఆచంట పోలీస్ స్టేషన్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల దొంగతనం కేసులో జైలు కెళ్లి బయటకు వచ్చిన మత్స్యపురికి చెందిన కారేపల్లి ఏసురత్నం కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. అనుమానం రావడంతో అదుపులోకి తీసుకొని విచారించగా పాలకొల్లు రూరల్, పెనుమంత్ర, పోడూరు స్టేషన్ల పరిధిలో 10 బైక్‌లు దొంగిలించినట్లు అంగీకరించాడన్నారు. వీటిని రికవరీ చేశామన్నారు. ఏసురత్నంపై నర్సాపురం టౌన్, రూరల్, పాలకొల్లు టౌన్, భీమవరం టూ టౌన్, అత్తిలి, మొగల్తూరు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ జి.శ్రీనివాస్, ఎస్సై బి.సురేంద్ర కుమార్, సిబ్బంది శ్రీనివాసరావు, బి బాలాజీ, ప్రసాద్ బాబు, వెంకటేశ్వరరావు, రాంబాబును అభినందించారు.



రికవరీ చేసిన మోటారు సైకిళ్లను చూపుతున్న ఎస్పీ నయీమ్ అస్మీ

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

నరసాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం మొగల్తూరు మండలం కాళీపట్నం ఈస్ట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై జి.వాసు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రంగిశెట్టి రామారావు(77)ను జాతీయ రహదారిపై బైక్ ఢీకొట్టింది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

దోపిడీ దొంగల అరెస్టు

తణుకు అర్బన్: లిఫ్ట్ ఇచ్చి దారిదోపిడీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి నమోదైన 6 కేసుల్లో బుట్టాయిగూడెం మండలం కె.రామచంద్రపురానికి చెందిన ఏలూరి ప్రేమ్‌కుమార్, వీరవాసరం మండలం నవుడూరుకు చెందిన కాపా సుభాకర్‌లను శనివారం ఉదయం అరెస్టు చేసి వారి నుంచి రూ. 2.87 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, రెండు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులిద్దరూ పైడిపర్రులోనే నివసిస్తున్నారని, రాత్రి సమయాల్లో ఒంటరిగా వాహనాల కోసం ఎదురుచూసే వారిని ఎంచుకుని వాహనాలపై ఎక్కించుకున్న పిదప మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లి బెదిరించి డబ్బు, బంగారు ఆభరణాలు, మొబైల్స్ దోచుకుంటున్నారని తెలిపారు.

క్లుప్తంగా

కారుమూరిని కలిసిన కోడె విజయలక్ష్మి


మాజీమంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోడె విజయలక్ష్మి

తణుకు అర్బన్: మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావును పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళాధ్యక్షురాలుగా ఇటీవలే నియమితులైన కోడె విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అత్యధిక ప్రాధాన్యనిస్తారని అన్నారు. ఎంతో నమ్మకంతో ఆయ న అప్పగించిన బాధ్యతను స్వీకరించి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. భీమవరం పట్టణాధ్యక్షుడు రాజు, కాంట్రీకుల శీను, కందిగట్ల ఎడ్వర్డ్, కడలి శ్రీనివాస్, ఎండీ పాషా, ఇంటి సత్యనారాయణ, వేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ విధానం పరిశీలన


అత్తిలిలో చెత్త సేకరించే విధానాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

అత్తిలి: మండలంలో అత్తిలి, గుమ్మంపాడు గ్రామాలలో ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని ఈఓపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు శనివారం ఉదయం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని గృహ యజమానులు అవగాహన కల్పించారు. అత్తిలి గ్రామంలో కుమ్మర వీధిలో సంపద తయారీ కేంద్రంలో తడి, పొడిచెత్తతో సంపద సృష్టించే అవకాశం ఉందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు జి.భాస్కర్, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్

అత్తిలి: రెండువారాలకు మించి దగ్గు, ఆకలి తగ్గడంవంటి లక్షణాలుఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు జరిపించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ కె.రమేష్ అన్నారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడు తూ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే సరైన చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని సూచించారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు క్షయ సోకే అవకాశాలు ఎక్కువని, కాబట్టి జాగ్రత్తలు తీసుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

అగ్రిగోల్డ్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలి


ఎమ్మెల్యే రాధాకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న భీమారావు, అగ్రిగోల్డ్ బాధితులు

తణుకు అర్బన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య ను శాసనసభలో ప్రస్తావించి వారికి న్యాయం చేసేలా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృషి చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివా రం అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు ఎమ్మె ల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీ (ఎస్వీవీ)ని ఏర్పాటుచేసి బాధితుల సమస్యల పరిష్కరించాలని, అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన ఆస్తులన్నింటిని కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వై.నాగలక్ష్మి, తణుకు బ్రాంచ్ కార్యదర్శి ఎన్.రామశ్రీను, వి.మాణిక్యాంబ, విప్పర్తి గోపి, ఎన్.వెంకట్రావు, జి.దామోదరరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌సీకి నిధులు కేటాయించాలి

భీమవరం: రాష్ట్ర బడ్జెట్లో 12వ పీఆర్‌సీకి నిధులు కేటాయించి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని (ఐఆర్) ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 28న ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పీఆర్‌సీ, డీఏ, సరెండర్ లీవ్స్, ఏపీ జీఎల్ఐ ఏరియర్స్‌కు నిధులు కేటాయించాలని కోరారు.

బైక్ స్టంట్‌లతో హడల్

- హడలిపోతున్న ప్రయాణికులు
- ఆస్పత్రులపాలవుతున్న వృద్ధులు


తణుకులో ట్రిబుల్ రైడింగ్‌లో బైక్‌పై వేగంగా వెళ్తున్న మైనర్‌లు

తణుకు అర్బన్: రయ్.. రయ్‌మంటూ బాంబులు వేస్తున్న సౌండ్‌లతో వాహనాలు నడుపుతున్న ఆకతాయిల ఆగడాలకు తణుకులో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. పాముల మాదిరిగా వంకర్లు తిప్పుతూ నడుపుతున్న ద్విచక్ర వాహనాలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చాక క్షేమంగా తిరిగి ఇంటికి చేరాలంటే తణుకులో ఆకతాయిల దయా దాక్షిణ్యాలపైనే ఆధారపడి ఉందంటూ వృద్ధులు గగ్గోలుపెడుతున్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, సొసైటీ రోడ్డుల్లో మైనర్‌లు, యువత ద్విచక్ర వాహనాలు నడుపుతున్న తీరు అత్యంత ప్రమాదకరంగా మారింది. కనురెప్ప మూసి తెరిచేలోపు పక్క నుంచి ర్యాకెట్ మాదిరిగా 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బైక్‌లు దూసుకువెళ్తుంటే గుండె బేజారైపోతుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఏదో పక్కన వృద్ధులు, ప్రయాణికులను ఆకతాయిలు ఢీకొట్టి సైలెంట్‌గా జారుకోవడంతో వారు ప్రమాదాల్లో తీవ్ర గాయాలతో ఆస్పత్రుల పాలైపోతున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈ తరహా కేసులు ఇటీవల కాలంలో పెరిగినట్లుగా తెలుస్తోంది. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన క్రమంలో ఏదైనా ప్రమాదంలో నష్టం జరిగితే తండ్రికి జైలు శిక్ష పడుతుందని నిబంధనలు ఉన్నాయని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నా యువత, ఆకతాయిల్లో ఎటువంటి మార్పు రావడం లేదు

ఇష్టమొచ్చినట్లు డ్రైవింగ్

150 సీసీ ఉన్న బైక్‌లు, మోపెడ్‌లను ప్రధాన రహదారుల్లో పాము మెలికలు తిప్పుతూ నడిపేందుకు మైనర్లు అలవాటు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయాల్లో ఆకతాయిలైన ఈ మైనర్లు ఆడపిల్లలను ఆకర్షించేందుకు రహదారులపై రకరకాల ఫీట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయంలో ఈ ఆకతాయిలు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గరల్స్ హైస్కూలు, చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్‌వీటీ కళాశాల, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలల వద్ద ఆకతాయిలు సినిమాల్లో మాదిరిగా బైక్‌లపై స్టంట్స్ చేస్తూ ఆడిపిల్లలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోజూ కౌన్సెలింగ్‌లు

తణుకు రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ పోలీసులు ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా పోలీసుల కళ్లుగప్పి వారి ఆనందాన్ని తీర్చేసుకుంటున్నారు. పోలీసులను దూరం నుంచి చూసి బైక్‌లను అమాంతం తిప్పేసి వారికి మస్కా కొడుతున్నారు. ఇటీవల కాలంలో పోలీసు అధికారులు రహదారుల్లో మైనర్‌లకు అవగాహన కల్పించడమే కాకుండా వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి వార్నింగ్‌లు ఇస్తున్నా ఆకతాయిల్లో మార్పు రావడం లేదని పోలీసులు చెబుతున్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న తాడేపల్లిగూడెం బస్టాండ్ నుంచి ప్రతి పది నిమిషాలకు వీరంపాలెంకు, ప్రతి 30 నిమిషాలకు పట్టిసం క్షేత్రానికి బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తణుకు అర్బన్: మహా శివరాత్రి సందర్భంగా తణుకు ఆర్టీసీ డిపోనుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు లు నడుపుతున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం 6 గంటలకు తణుకు నుంచి శ్రీశైలానికి బయలుదేరుతుందని చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.830, పిల్లలకు రూ.460గా నిర్ధేశించామని స్పష్టం చేశారు. ఈ సూపర్‌లగ్జరీ బస్సుకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, రిజర్వేషన్ కోసం 94404 19144 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ఈ నెల 25, 26 తేదీల్లో తాడేపల్లిగూడెం మీదుగా పట్టిసీమకు ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని, 26న తణుకు నుంచి నత్తా రామేశ్వరానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ప్రముఖ వైద్యుడు కర్రి నాగేశ్వరరావు మృతి


డాక్టర్ కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ప్రముఖ వైద్యుడు, గొప్ప సేవా తత్పరుడు కర్రి నాగేశ్వరరావు (84) శనివారం తెల్లవారుజామున ఆయన నివాసం వద్ద గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రజలు గజారోహణతో కూడిన కనకాభిషేకం చేశారు. ఆయనకు భార్య లక్ష్మీనరసమ్మ ఉన్నారు. వీరి పెద్ద కుమారుడు డాక్టర్ కర్రి భాస్కరరావు పట్టణంలో ప్రముఖ డాక్టర్‌గా పేరొందారు. మరో ఇద్దరు కుమారులు కర్రి వెంకటరత్నం, కర్రి సుధాకర్, కుమార్తె జె.మంగాదేవి, కోడళ్లు, అల్లుడు, మనుములు ఉన్నారు. డాక్టర్ కర్రి నాగేశ్వరరావు 52 ఏళ్లుగా పట్టణంలో వైద్య సేవలు అందిస్తున్నారు. 1981లో పట్టణ మునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. కర్రి నాగేశ్వరరావు కర్ణాటకలో గుల్బర్గా ఎంఆర్ఎంసీ మెడికల్ కళాశాలలో చదువుకున్నారు. ఆయన వైద్య విద్యనభ్యసిస్తున్న సమయంలోనూ అనంతరం మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ రాజశేఖరరెడ్డితో డాక్టర్ కర్రి నాగేశ్వరరావు సన్నిహితంగా మెలిగేవారు. డాక్టర్ కర్రి నాగేశ్వరరావు మృతికి పట్టణ ప్రముఖులు పసల అచ్యుతం, గట్టిం మాణిక్యాలరావు, న్యాయ వాది మాకా శ్రీనివాస్‌రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు, బ్యాంక్ ఉద్యోగులు డాక్టర్ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి


ఉయ్యాలవాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి జన సంఘ నాయకులు

తణుకు అర్బన్: రెడ్డి జన సంఘీయుల ఆరాధ్య దైవం, దేశ ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవన విధానం ఆదర్శనీయమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి జనసంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి అన్నారు. నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భంగా పైడిపర్రు రెడ్డి జనసంఘ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఉయ్యాలవాడ జీవిత చరిత్ర, పోరాటపటిమ, దేశ భక్తి భావిపౌరులకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సాధనకోసం మొదటగా ప్రాణాలర్పించిన మహా యోధుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు తమనంపూడి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడి భీమారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి సత్తి అజయ రెడ్డి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు కొవ్వూరి నాగేంద్రరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడెం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ


తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి

తాడేపల్లిగూడెం : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రోన్ బీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులను సత్వరం పరిష్కరించాలని సూచించామన్నారు. మహాశివరాత్రి, ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తొలుత ఆయన పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయన వెంట డీఎస్పీ డి.విశ్వనాథ్, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు నాగరాజు, శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై కొండలరావు ఉన్నారు.

సందడిగా జోనల్‌స్థాయి క్రీడాపోటీలు


క్రీడాకారులతో ఎంఈవో టీవీ రామకృష్ణ

పెంటపాడు: స్థానిక ఎస్టీవీఎస్ హిందూ హైస్కూల్లో మూడు రోజులపాటు కొనసాగనున్న స్కూలు ఫెడరేషన్ ఆఫ్ జోనల్ స్థాయి క్రీడాపోటీలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిరోజు అథ్లెటిక్స్ పోటీల్లో పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాల నుంచి 6 విభాగాల్లో ఏడుగురు విద్యార్థులు ప్రతిభను కనపరిచారు. మండల విద్యాశాఖాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్, హెచ్ఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు. 24,25 తేదీల్లో పలు విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు అభినందించారు.

నవాబుపాలెంలో ఉపాధి పనుల పరిశీలన


నవాబుపాలెంలో ఉపాధి హామీ కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: నవాబుపాలెంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను శనివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయమూర్తులు వ్యవసాయ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ సబ్సిడీలు, సంక్షేమ పథకాల వల్ల సోమరిపోతుల్లా మారుతున్నారని వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. వ్యవసాయ రంగంలో ప్రధానంగా ఉత్పత్తిలో భాగస్వాములు ఉంటూ కష్టించి పనిచేసే వ్యవసాయ కూలీల పట్ల న్యాయమూర్తులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. గతం కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదించడం దారుణమన్నారు. తక్షణమే బడ్జెట్ సవరణ చేసి ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడారు. మార్చి 12న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహాధర్నాకు కూలీలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు, మద్దుకూరి కృష్ణ, ఘంటసాల బాబూజీ, కండెల్లి విజయ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి


చినతాడేపల్లిలో తడి, పొడి చెత్తలను వేరు చేసే ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామ పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని చిన తాడేపల్లిలో తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. తద్వారా వర్మీ కంపోస్టు తయారు చేయడం సులభతరం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో తడి, పొడి చెత్తలకు వేర్వేరుగా బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయరాదని సూచించారు. పట్టింపాలెంలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బిరుదుకోట రమేష్, ఎంఆర్‌సీ రవికిరణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ డానియేల్, డిజిటల్ అసిస్టెంట్ సత్యనారాయణ, వీవోఏలు, ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

● ఉత్సాహంగా కవలల దినోత్సవం


తణుకు మాంటిస్సోరీ స్కూలులో కవలలు


బల్లిపాడు పాఠశాలలో కవలలు

నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం కవలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కవలలు గర్భాన్ని పంచుకోవడమే కాకుండా ఆశలను, ఆశయాలను పంచుకుని కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా జీవితాంతం నిలబడి సంతోషంగా జీవించాలని వక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

- అత్తిలి/తణుకు అర్బన్

సామూహిక సింధూరార్చన


హౌసింగ్ బోర్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సామూహిక సింధూరార్చన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు ఎంట్రన్స్‌లోని దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సింధూరార్చన నిర్వహించారు. రథసప్తమి నుంచి హనుమాన్ జయంతి వరకు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆకుల నరసింహమూర్తి, హనుమాన్ యూత్ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

ఆకివీడు : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓలు ఎ.రవీంద్ర, సీతారామయ్యలు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ స్కూల్‌లో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల నాలుగో రోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు రానున్న రోజుల్లో నడపనున్నారని తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మక శక్తి, భావోద్వేగాల్ని గుర్తించి తద్వారా వారికి విద్యా బోధన చేయాలని సూచించారు. అంగన్‌వాడీల్లో నైపుణ్యతకు శిక్షణ దోహదపడుతుందని తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తే అధిక మార్కులు

కాళ్ల: పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించి అధిక మార్కులు సాధించాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ కేవీ సుబ్బరాజు అన్నారు. కాళ్ల మండలం సీసలి హైస్కూల్లో జయలక్ష్మి సీ ఫుడ్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం ఏర్పాటుచేసిన మోటివేషన్ క్లాసులో ఆయన మాట్లాడారు. అనంతరం జయలక్ష్మి సీ ఫుడ్స్ ఎండీ మహినాథ్ ఆర్థిక సాయంతో పాఠశాలకు సుమారు రూ.50 వేలు విలువచేసే సీలింగ్ ఫ్యాన్లు, విద్యార్థులకు ప్యాడ్లు, క్యాంపస్ బాక్సులను అందజేశారు. యూ ట్యూబ్ వారు తయారు చేసిన రూ.20 వేలు విలువ చేసే గైడులను గ్రామస్తులు నూకల భోగేంద్రబాబు ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


8న జాతీయ లోక్‌అదాలత్

భీమవరం: భీమవరంలో మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీ అయ్యేలా మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసుపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అనానరు. శనివారం ఆయన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సుమారు 200 ఇన్సూరెన్స్ కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో న్యాయవాదులు నిమ్మల సత్యనారాయణ, పాకా రమేష్‌బాబు, ఎన్ సుధీర్, శేషు తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగస్థల కళాకారుల సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ 153వ నెలవారీ సభ, సమావేశం ఈ నెల 23వ తేదీ ఆదివారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, ప్రధాన కార్యాదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి మాసా బాబూరావు వెల్లడించారు. నీలాద్రిపురం ఆర్కే ఈవెంట్స్ అధినేత పాముల రామకృష్ణకు గౌరవ సత్కారం. నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన రంగస్థల కళాకారుడు యడవల్లి రాజలింగంకు కళా సత్కారం, ప్రధానోపాధ్యాయులు ఇర్లపాటి వెంకటకృష్ణారావుకు ఉత్తమ ఉద్యోగ సేవ పురస్కారం, పేద కళాకారుడు జి.రాంబాబుకు ఆర్థిక సత్కారం అందజేస్తారని తెలిపారు. శక్తి వేషాలు, డప్పులు నృత్యాలు, సంగీత విభావరి నిర్వహిస్తారని వెల్లడించారు. కళాకారులు, సాహితీ సభ్యులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ


ఈడూరులో విశేష అలంకరణలో వెంకన్న

అత్తిలి: మండలంలోని ఈడూరులో ఉన్న వరాల వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చనలు చేశా రు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు.

పంట కాలువలో వ్యర్థాలు వేస్తే చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల రోడ్డును ఆనుకుని ప్రవహిస్తున్న పంట కాలువలో ప్లాస్టిక్ కవర్లు, ఆహార వ్యర్థాలు, చెత్త వేస్తే వెంటనే చర్యలు తీసుకుని కలుషితాన్ని అరికట్టాలని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మునిసిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట కాలువ నీరు దిగువ గ్రామాల ప్రజలు తాగు నీరుగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ నీటిలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని, ర్యాలీ నిర్వహించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించే వారికే పట్టం కట్టండి


ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులును గెలిపించాలని కోరుతున్న గోపాలన్

పాలకోడేరు: సమస్యలు పరిష్కరించే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ ఓటర్లను కోరారు. శనివారం పాలకోడేరు మండలం శృంగవృక్షంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల రాఘవులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు మొదటి ప్రాధాన్యత ఓటును రాఘవులుకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉద్యమ ప్రస్థానంలో సమస్యలు పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసిన రాఘవులును చట్టసభకు పంపాల్సిన అవసరం మనందరినాపైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రయ, రామయ్య, పాండురంగారావు, ఉదయ, కొటికలపాడు శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి


ఆర్డీవో కార్యాలయ ఇన్‌ఛార్జ్ ఏవో అనూరాధకు వినతిపత్రం అందజేస్తున్న రొక్కాల నాగబుజ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పది, ఇంటర్ విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌బానోకు సబ్ డివిజన్ ప్రభుత్వ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగబుజ్జి కోరారు. ఈ మేరకు శనివారం ఆర్డీవో కార్యాలయ ఇన్‌ఛార్జ్ ఏవో అనూరాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రొక్కాల నాగబుజ్జి మాట్లాడుతూ మార్చిలో పది, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తారని, హాల్ టికెట్ కలిగిన ప్రతి విద్యార్థికి ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి విద్యార్థుల డిమాండ్‌ను తీసుకెళ్తానని తెలిపారు

ముగిసిన టెక్నికల్ సింపోజియం

భీమవరం: ఆర్థికపరమైన అంచనాలతో ఉద్యోగులు ఆర్థిక ప్రగతి సాధిస్తారని ఫైనాన్స్ అడ్వైజర్ ఎం కౌశిక్ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిపుణ 25 పేరుతో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా హాజరైన కౌశిక్ మాట్లాడుతూ ఆదాయం, ఖర్చు అంచనాలను ముదుపు చేసుకోవడంలో కూడా ప్రణాళిక బద్ధంగా సాగాలన్నారు. ఒక్కోసారి స్టాక్ మార్కెట్లో మార్పులు వచ్చినా కంపెనీల పరిస్థితి అధ్యయనం చేసిన తరువాతే పెట్టుబడిపై పరిశీలన చేయాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నిపుణ కార్యక్రమానికి పూర్వవిద్యార్థుల అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు ఒకరి భావాలు ఒకరు పంచుకుంటూ స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎస్ రామ్‌గోపాల్ రెడ్డి, స్టూడెంట్ బాడీ వైస్ ప్రెసిడెంట్ ఎస్ షణ్ముఖప్రియ, సంజయ్, రత్న కుమారి, కుసుమ పాల్గొన్నారు.